క్లుప్తంగా

తాడేరు విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన



తాడేరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న గీతాబాయి

భీమవరం అర్బన్: విలేజ్ క్లినిక్‌లకు ఏ రోగి వచ్చినా అన్ని రకాల వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాడేరులో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందిని వైద్యపరంగా అంశాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు రోగులు ఎంతమంది వస్తున్నారు? ఏయే మందులు అందుబాటులో ఉన్నాయి? అనే అంశాలు ఆరా తీశారు. రోగులపై నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు వస్తాయని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తల్లి, శిశు సంక్షేమం కోసం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు కృషి చేయాలన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రారంభం



జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా జిల్లా దివ్యాంగులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని నరసాపురం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దాసి రాజు అన్నారు. శనివారం స్థానిక అంజలి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఆర్డీఓ దాసి రాజు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పునరావాస కేంద్రాన్ని ప్రారంభించామని, అతి త్వరలో అనుమతులు వస్తాయని అనుమతులు వచ్చిన అనంతరం ఇక్కడ నుంచి పరికరాలు అందిస్తామని స్పష్టం చేశారు. అంజలి పాఠశాల చైర్మన్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి పునరావాస కేంద్రం అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ విడివి ప్రసాద్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంబటి సాయితేజ, అనంతపల్లి సాయి సతీష్, ఎంఈఓ ఐఆర్ఎస్‌వీజి శర్మ, అడ్డాల వాసు, పప్పుల దుర్గేష్ పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణోత్సవాలు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు వైకానస ఆగమ ప్రకారం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో శుక్రవారం మధ్యాహ్నం స్వామివారి పల్లకి ఉత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సదస్యం, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, చక్రస్నానం రాత్రి స్వామికి పుష్పయాగం నిర్వహిస్తారు. ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాతలు నోట్ పుస్తకాలు అందించారు. శనివారం విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్ కోసం దాత ధర్మ పరిరక్షణ అధ్యక్షులు గాదె వెంకన్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారం ఉపయోగపడుతున్నాయని పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు.

ఆస్తి పన్ను చెల్లించాలి

నరసాపురం: పెద్ద మొత్తంలో ఏళ్ల తరబడి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు బకాయిలు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మొండి బకాయిలు రాబట్టడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. వార్డు సచివాలయాల కార్యదర్శులు పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే భారీ మొత్తంలో ఆస్తి పన్నులు బకాయిలున్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

బిల్లులు ఇవ్వండి మహాప్రభో

- గోకులం షెడ్ల బిల్లుల ఇంకా చెల్లించని సర్కారు
- అప్పులు తీసుకొచ్చి నిర్మించామని పాడి రైతుల ఆవేదన



కుముదవల్లిలో లబ్ధిదారులు నిర్మించుకున్న గోకులం షెడ్డు



గోకులం షెడ్ను పరిశీలిస్తున్న ఎనర్జీ ఎస్ అధికారులు (ఫైల్)

పాలకోడేరు: కూటమి సర్కారు గోకులం షెడ్ల పేరుతో నిండాముంచిందని పాడి రైతులు వాపోతున్నారు. నెలల తరబడి గోకులం షెడ్ల బిల్లుల సొమ్ము ఖాతాల్లో పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు పశువుల షెడ్ యూనిట్ కాస్ట్ రూ.2.30 లక్షలు కాగా ఇందులో 90 శాతం ఉపాధి నిధుల కింద చెల్లిస్తే 10 శాతం లబ్ధిదారుల వాటా కింద నిర్ణయించారు. ముందుగా పాడి రైతులు షెడ్లు నిర్మిస్తే సబ్సిడీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పడంతో చాలా మంది అప్పులు తెచ్చి మరీ గోకులం షెడ్లను నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన షెడ్లల్లో ఎక్కువ శాతం కూటమి పార్టీ కార్యకర్తలు, నాయకులే దక్కించుకున్నారు. కానీ షెడ్లు నిర్మాణానికి పశువులు ఉండాలనే కచ్చితమైన నిబంధన పెట్టడంతో అధికార పార్టీ నాయకుల సిఫారసులతో షెడ్లను అధికారులు మంజూరు చేశారు. అయితే నెలల తరబడి గోకులం షెడ్ల నిర్మాణాల బిల్లులు చెల్లించకపోవడంతో సొంత ప్రభుత్వంపైనే గుర్రుగా ఉన్నారు. ఇక చేసేది లేక బిల్లులు ఎప్పుడు ఇస్తారు? అంటూ లబ్ధిదారులు ఉపాధి హామీ కార్యాలయాల, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు, ఈసీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఖాతాలు పరిశీలించుకోవాలని ఉచిత సలహా

పనులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లిస్తున్న ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. అయితే లబ్ధిదారులు సకాలంలో షెడ్ల పనులు పూర్తి చేసిన నేటికి బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఈ నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో అని రైతులు ఎదురు చూస్తున్నారు. నిర్మాణాలు పూర్తి అయిన వారి వివరాలు నమోదు చేసి పంపామని వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని ఉపాధి హామీ సిబ్బంది చెబుతున్నారు. బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు జమ కాలేదని చెబుతున్నారు. లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.2 లక్షలకు పైగా ఖర్చు

గోకులం షెడ్డు మంజూరు కావడంతో ఉపాధి హామీ సిబ్బంది తొందర పెట్టారు. త్వరలో నిర్మించుకోకపోతె షెడ్డు రద్దు అవుతుందని చెప్పడంతో లక్షలు ఖర్చు చేసి షెడ్ నిర్మించుకున్నాను కొంత బిల్లు వచ్చింది. అప్పటి నుండి ఇప్పడి వరకు బిల్లు పడలేదు. ఉపాధి హామీ సిబ్బందిని అడిగితే బిల్లులు పెట్టాం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలి

– పి.సాయి కుముదవల్లి

అప్పులు చేసి నిర్మాణం

వర్షాలు ఎండలకు పాడి పశువులను కట్టడానికి ఇబ్బందిగా ఉందని షెడ్ మంజూరు చేశారు. దీంతో పశువులకు నీడ ఉంటుందనే ఆశతో అప్పులు చేసి షెడ్ పనులు పూర్తి చేసుకున్నాను. బిల్లు మాత్రం మా ఖాతాలో పడలేదు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు వచ్చేలా చూడాలి.

– కె.శ్రీనివాస్ రైతు, మోగల్లు

బిల్లులు అప్‌లోడ్ చేశాం

మండలంలో ఉపాధి హామీ నిధులతో షెడ్లు, సీసీ రోడ్లు కాలువల నిర్మాణాలు చేపట్టాం. వాటికి సంబంధించిన బిల్లులను చెల్లించాలని ప్రభుత్వానికి గత రెండు నెలలు క్రితమే విన్నవించాం. అందుకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. త్వరలో బిల్లులు విడుదల అవుతాయి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ప్రకాష్ టెక్నికల్ అసిస్టెంట్ పాలకోడేరు

ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

ఆకివీడు: స్థానిక ముస్లిం వీధిలో నివసిస్తున్న విద్యార్థినీ షేక్ సనా జేఈఈలో 935 ర్యాంక్ సాధించింది. ఈ మేరకు ఆమెను శనివారం ఆకివీడులో ముస్లిం కమిటీ తరఫున సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వల్లి విద్యార్థినికి సత్కరించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎండీబిలాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎండీ పర్వీన్ బేబీ జక్కి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

ఉండి: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని ఉండి మసీదు పెద్ద గురువు అర్షద్ అహ్మద్ అన్నారు. శనివారం బక్రీదు పండుగను పురస్కరించుకుని ఉండి మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. అనంతరం ఇమామ్ అర్షద్ మాట్లాడుతూ ఖురాన్‌లోని ఇబ్రహీం ప్రవక్త చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో ఉండి పరిసర ప్రాంతాల్లోని ముస్లింలు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: బక్రీదు పండుగ పురస్కరించుకొని ఆకివీడులో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెద్ద మసీదు (అలంగీర్) వద్ద నుంచి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అన్వరీ మసీదు వరకు జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరూ శాంతి సామరస్యాలతో, స్నేహ భావంతో కలిసిమెలిసి ఉండాలని ముస్లిం పెద్దలు బోధించారు.

నిప్పులు కురిపించిన భానుడు



నిర్మానుష్యంగా ఉన్న భీమవరం ఏరియా ఆసుపత్రి రోడ్డు



ఆకివీడులో ఖాళీగా ఉన్న రోడ్డు



ఎండవేడిమికి తాళలేక తలపై చున్నీలు వేసుకున్న మహిళలు



తలకు టవల్ కట్టుకుని మోటారుసైకిల్‌పై ప్రయాణం



ఆకివీడులో ముసుగులతో ప్రయాణం

రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయనే నానుడి ఉంది. అయితే ఈ ఏడాది రోహిణి కార్తె ప్రారంభంలో భిన్నవాతావరణ పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ రోహిణీ కార్తె ముగింపులో మాత్రం భానుడు నిప్పులు కురిపించాడు. ఎండ దెబ్బకు తాళలేక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. తప్పనిసరి వచ్చిన వారు ఎండ దెబ్బకు విలవిల్లాడారు. ఎండ నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. –భీమవరం/ఆకివీడు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



గుడ్డ సంచిపై సంతకం చేస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. పర్యావరణ ప్రేమికుడు సబ్బితి వినయ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 6 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పుతో వస్త్రంతో సంచి తయారు చేసి ఆర్డీవో కార్యాలయంలో ప్రదర్శించారు. శనివారం సంచిపై ఆర్డీఓ సంతకం చేసి మాట్లాడారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ఓ సవాల్‌గా మారిందన్నారు. ప్లాస్టిక్ వాడకం అరికట్టకపోతే భవిష్యత్‌లో పెను నష్టాలు చవిచూడాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వినయ్ గతంలో కూడా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేశారని అభినందించారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలి బంధువుకు నగదు అందిస్తున్న గాంధీరాజు

పాలకొల్లు సెంట్రల్: యలమంచిలి మండలంలోని గుంపర్రు గ్రామానికి చెందిన బండి సత్యవాణికి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. బాధితురాలు బోనె మెరో వ్యాధి బాధపడుతుందని విషయం తెలియజేయగా వసుధ ఫౌండేషన్ నుండి రూ. 10 వేలు నగదు అందించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చేతులు మీదుగా బాధితురాలి తండ్రికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఐవీ రామరాజు, ఎ.త్రిమూర్తులు రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

భీమవరం: దేశంలో ప్రధాని మోదీ పాలన 2047 నాటికి భారత్‌ను పూర్తిస్థాయి వికసిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంగా సాగుతోందని, 11 ఏళ్ళ మోదీ పాలనలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి చేసిన కృషిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం భీమవరంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కార్యశాలలో ఆయన మాట్లాడారు. 11 సంవత్సరాలు మోదీ పాలనలో సాధించిన విజయాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఈ నెల 9 నుంచి 20 వరకు ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలకొల్లులో ఒక్కపూటే తాగునీరు

పాలకొల్లు సెంట్రల్: నిడదవోలు, నరసాపురం కాలువ పూడిక పనుల్లో భాగంగా కాలువ నీరు పాలకొల్లు కెనాల్‌కు చేరుకోవడానికి మరికొంత ఆలస్యం అవుతున్న కారణంగా పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడింది. వేసవిలోను రెండు పూటలా తాగునీరు అందించగా నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో పట్టణ ప్రజలకు ఒక్క పూట మాత్రమే తాగునీరు అందించనున్నట్లు మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. కాలువ విడుదల అయ్యే వరకూ ఆదివారం నుంచి ఉదయం 6 నుండి 7 గంటల వరకూ ఒక్కపూట మాత్రమే నీరు అందించనున్నామని స్పష్టం చేశారు.

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురుగు నీరు వస్తుంది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలువాపోతున్నారు.

సేవల్లో రా'రాజు'

- సిమెంట్ రంగంలో చెరగని ముద్ర
- నేడు పద్మభూషణ్ బీవీ రాజు వర్ధంతి

సాక్షి, భీమవరం: దేశంలో సిమెంట్ పరిశ్రమ అభివృద్ధికి కీలక కృషి చేసిన పద్మభూషణ్ డాక్టర్ భూపతిరాజు విస్సంరాజు (బీవీ రాజు) సేవల్లో రారాజుగా నిలిచారు. ముఖ్యంగా భీమవరం ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు నేటికి సజీవంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. విద్య, పారిశ్రామిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలకు గాను బీవీ రాజును కేంద్ర ప్రభుత్వం 1997లో ప్రతిష్టాత్మక పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. బీవీ రాజు వర్ధంతి సందర్భంగా ఆయన గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

కుముదవల్లిలో జననం

1920 అక్టోబరు 15న జిల్లాలోని కుముదవల్లిలో చిన్న వ్యవసాయ కుటుంబంలో బీవీ రాజు జన్మించారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్ చేశారు. అమెరికాలో హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ సాధించారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చైర్మన్, ఎండీగా దేశంలో సిమెంట్ పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని సేవలను అందించడంతో పాటు తమిళనాడు, కేరళ, ఒరిస్సా, యూపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాదారునిగా సేవలందించారు.

విద్యారంగంలో విశిష్ట కృషి

బీవీ రాజు 1992లో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు. ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డెంటల్, ఎంసీఏ, ఐటీ తదితర కోర్సులతో పాటు, విష్ణు పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేశారు.

సేవా కార్యక్రమాలెన్నో

బీవీ రాజు ఫౌండేషన్ ద్వారా తన స్వగ్రామమైన కుముదవల్లిలో 2.91 ఎకరాల భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేశారు. 1.24 ఎకరాలను ఎస్సీ సామాజికవర్గంలోని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చారు. గ్రామ తాగునీటి అవసరాల కోసం మూడు ఎకరాలను పంచాయతీకి రాసిచ్చారు. 2000 సంవత్సరంలో రూ.2కోట్లు వ్యయంతో హైస్కూల్, ఇతర పాఠశాలలకు భవనాలను నిర్మించారు. తాను నివసించిన ఇంటిని పేద విద్యార్థుల కోసం నాలెడ్జ్ సెంటర్‌గా అభివృద్ధి చేశారు. తాడేపల్లిగూడెం రోడ్డులోని ఇళ్లు లేని పేదల కోసం కొవ్వాడ అన్నవరంలో 2.54 ఎకరాల్లో ఇళ్ల స్థలాలిచ్చారు. భీమవరం, శృంగవృక్షంలోని లెప్రసీ రోగుల పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాలల నిర్మాణం, బ్యాంకులో రూ.10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో లెప్రసీ రోగులకు అవసరమైన మందులు కొనిచ్చే ఏర్పాటుచేశారు.

నేడు వర్ధంతి

ఏటా బీవీ రాజు జయంతి, వర్ధంతిని మనువడు విష్ణురాజు భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందులోభాగంగా ఆదివారం 23వ వర్ధంతిని పురస్కరించుకుని భీమవరం, కుముదవల్లి, కొవ్వాడ అన్నవరం, శృంగవృక్షం తదితర గ్రామాల్లోని మూడు వేల మందికి పైగా పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు విష్ణు విద్యాసంస్థల వర్గాలు తెలిపాయి.


తాత ఆశయ సాధనకు కృషి

విద్య, సేవా రంగాలకు బీవీ రాజు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. ఆయన అడుగుజాడల్లో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తోంది. అత్యుత్తమ బోధనతో విద్యార్థుల ఉన్నతికి బాటలు వేయడంతో పాటు నిరంతర సేవా కార్యక్రమాలతో పేదలు, పరిసరాల అభివృద్ధికి పాటుపడుతున్నాం.

-కేవీ విష్ణురాజు, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, భీమవరం



లెప్రసీ రోగులకు సాయం చేస్తున్న బీవీ రాజు(ఫైల్)



పద్మభూషణ్ బీవీ రాజు (ఫైల్)

ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు



కోలమూరులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఉండి: గత ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించిందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. గ్రామ స్థాయిలో విస్తృత సమావేశాలు ఏర్పాటు చేస్తున్న సీపీఐ నాయకులు కూటమి పార్టీ మోసాలను ఎండగడుతున్నారు. శనివారం కోలమూరు, చిలుకూరు గ్రామ కార్యదర్శులు, ఉండితో పుడు బండ్ల శాఖల్లో సీహెచ్ కుమారి, కర్రి సూరిబాబు,గొర్రెల కోటీశ్వరరావులను కార్యదర్శులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామానా సురక్షిత తాగునీరు, వేళాపాళా లేని విద్యుత్ కోతలను నిరోధించాలంటూ గ్రామాల్లో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అన్నీ అస్తవ్యస్తంగా మారాయని మండిపడ్డారు.అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. నమ్మివారంతా దగా పడాల్సిందేనా? ఇదేనా కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చే బహుమానం అంటూ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.